సాక్షి ఖమ్మం

మంగళవారం । 23 । జూలై । 2024



.. నమ్మకం పెంచాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. 8లో



ఎంత మాఫీ అయింది?

రుణమాఫీపై రైతుల అభిప్రాయాలు సేకరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాల్సిన అవసరముందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలతి తెలిపారు. నేలకొండపల్లి ఆస్పత్రిని సోమవారం తనిఖీ చేసిన ఆమె రికార్డులు పరిశీలించడంతో పాటు ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేశారు. ఆ తర్వాత వైద్యులు, సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రికే వచ్చేలా చూడాలని తెలిపారు. అలాగే, వైద్యాధికారులకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శిస్తూ జ్వరపీడితులను గుర్తించి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ముప్పై ఏళ్ల వయస్సు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

జలవనరుల శాఖలో భారీగా బదిలీలు

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖ (నీటిపారుదల) ఖమ్మం సర్కిల్ పరిధిలో పెద్ద సంఖ్యలో ఉద్యోగుల బదిలీ జరిగింది. ఈ సందర్భంగా సీఈ విద్యాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా ఉద్యోగులు నూతన స్థానాల్లో మూడు రోజుల్లోగా చేరాలని సూచించారు. ఒకే చోట నాలుగేళ్లు పనిచేసిన వారితో పాటు అనారోగ్య సమస్యలపై ఆప్షన్ ఇచ్చుకున్న వారిని బదిలీ చేసినట్లు తెలిపారు. నలుగురు సూపరింటెండెంట్లు, 15 మంది సీనియరు అసిస్టెంట్లు, 20 మంది జూనియర్ అసిస్టెంట్లతో పాటు నలుగురు రికార్డు అసిస్టెంట్లు, 83 మంది అటెండర్లు, నలుగురు టైపిస్టులు జాబితాలో ఉన్నారు. కాగా, జిల్లాలో ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగులు బదిలీ కావడం ఇదే మొదటిసారని తెలుస్తోంది. అయితే, ఇంజనీర్ల ట్రాన్స్‌ఫర్లు మాత్రం ఇప్పట్లో లేవని తెలియడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

అప్‌గ్రేడ్ అయిన స్కూళ్లకు ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ఆరు స్కూళ్లను ఇటీవల ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులను కేటాయించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కూసుమంచి, చిలుకూరు ఉన్నత పాఠశాలలకు నలుగురు చొప్పున, ఎడవల్లి, లక్ష్మీపురం, తుమ్మలపల్లి పాఠశాలలకు ముగ్గురేసి ఉపాధ్యాయులతో పాటు బాలాజీనగర్ పాఠశాలకు ఇద్దరిని కేటాయించగా వారు మంగళవారం విధుల్లో చేరనున్నారని చెప్పారు. కాగా, జిల్లాలోని వివిధ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న చోట 150మంది సర్దుబాటు పూర్తయిందని తెలిపారు. ఇంకా ఎక్కడైనా పాఠశాలల్లో ఉపాధ్యాయులు అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాలతో కేటాయించనున్నట్లు డీఈఓ తెలిపారు.

బడ్జెట్‌లో జిల్లాకు ఎంత?!



నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- పథకాలకు నిధుల కోసం జిల్లావాసుల నిరీక్షణ
- సీతారామ, గ్యాస్ సబ్సిడీ, ఇతర అంశాలపై ఆశలు
- జిల్లాలో 320 కి.మీ. మేర దెబ్బతిన్న రహదారులు
- నిధుల లేమితో మున్సిపాలిటీలు, జీపీల్లో ఇక్కట్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పడకేసిన అభివృద్ధి పనులు, నిలిచిపోయిన నిర్మాణాలు, సంక్షేమ పథకాల కోసం అర్హుల ఎదురుచూపులకు బడ్జెట్‌లో ఎంత మేర నిధులు కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు మంగళంవారం ప్రారంభం కానున్నాయి. ఎన్నికలకు ముందు ప్రకటించిన పథకాల అమలుకు నిధులు కేటాయిస్తారని భావిస్తుండగా.. జిల్లావాసుల్లో ఆశలు నెలకొన్నాయి. ప్రధానంగా సీతారామ ప్రాజెక్టుకు నిధులు, గ్యాస్ సబ్సిడీ, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పథకాలకు నిధులు ఎంత మేర కేటాయిస్తారోనని ఎదురుచూస్తున్నారు.

రైతు భరోసాపై చర్చ

గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాగా మార్చింది. ఇప్పటికే జిల్లాల్లో రైతులు, రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలు సేకరించి, అసెంబ్లీలో సమావేశాల్లో చర్చించి విధివిధినాలు ప్రకటిస్తామని వెల్లడించారు. వానాకాలం పంటల సీజన్ మొదలైనందున త్వరగా నిర్ణయాన్ని వెల్లడించి పెట్టుబడి సాయం జమ చేయాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో 3.42 లక్షల మందికి గతంలో ఏటా రెండు సార్లు ఎకరాకు రూ.10వేల మేర రైతుబంధు అందింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యాన బడ్జెట్ సమావేశాల్లో ప్రకటన వెలువడుతుందనే భావన వ్యక్తమవుతోంది.

'ఆదర్శం' సగమే...

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల పర్యవేక్షణకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే 1,126 పాఠశాలల్లో తాగునీరు, కరెంట్, తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్ల ఆధునికీకరణ, కొత్త మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం 917 పాఠశాలలకు రూ.30,18,15,800 మంజూరయ్యాయి. అయితే, కొన్ని స్కూళ్లలో పనులు మొదలుకాగా, ఇంకొన్ని చోట్ల నిధుల కోసం చూస్తున్నారు. మిగిలిన పాఠశాలలకూ నిధులు కేటాయిస్తే సుందరంగా తీర్చిదిద్దినట్లు అవుతుంది.

ప్రగతి నిధులు నిలిచాయి..

ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర, వైరా, సత్తుపల్లి మున్సిపాలిటీలకు నిధులు రావాల్సి ఉంది. గతంలో పట్టణ ప్రగతితో పాటు ముఖ్యమంత్రి హామీ కింద వచ్చే నిధులు ఏడాదిగా రావడం లేదు. ఈ నిధులు వస్తే అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం, శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శివారు ప్రాంతాలు మురికికూపాలుగా మారాయి. ఎక్కడికక్కడే డ్రెయినేజీల్లో నీళ్లు నిలిచి చెరువులను తలిపిస్తున్నాయి. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తే ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి.

■ రోడ్లు గుల్ల..



గుబ్బగుర్తి వద్ద గుంతలమయమైన రోడ్డు

జిల్లాలో 320 కి.మీ. మేర రాష్ట్రీయ రహదారులు దెబ్బతిన్నాయి. గతంలో కొన్ని చోట్ల గుంతలు ఏర్పడగా ఇటీవల వర్షాలకు మరింత ఇబ్బందికరంగా మారాయి. దెబ్బతిన్న ఈ రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు రూ.119 కోట్లు అవసరమని ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే రహదారుల రూపురేఖలు మారి వాహనదారులకు తిప్పలు తప్పనున్నాయి.

■ సీతారామ.. సాగాలి



తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం వద్ద నిర్మిస్తున్న అక్విడెక్ట్ (ఫైల్)

ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా నిలిచే సీతారామ ప్రాజెక్టును ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని, వచ్చే ఆగస్టు 15న తొలిదశలో సాగు నీరు విడుదల చేస్తామని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ప్రకటించారు. ఈక్రమంలో సరిపడా నిధులు వస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. ప్రాజెక్టుకు సంబంధించి రెండు లిఫ్టుల ట్రయల్‌రన్‌లు పూర్తయింది. ఏన్కూరు వద్ద నాగార్జున సాగర్ కెనాల్‌కు అనుసంధానంగా కాల్వ నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరయ్యాయి. అయితే, ప్రధాన కాల్వతో పాటు పాలేరు నియోజకవర్గంలో టన్నెల్ పనులు కొనసాగుతున్నందున సరిపడా నిధులు కేటాయిస్తేనే మంత్రులు ప్రకటించినట్లుగా ఏడాదిన్నరలో ప్రాజెక్టు పూర్తవుతుంది.

■ మెడికల్ కాలేజీ, నూతన ఆస్పత్రులు



మెడికల్ కాలేజీకి కేటాయించిన స్థలం

గత ఏడాది జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరవడంతో పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయాలను బోధన, హాస్టళ్ల నిర్వహణకు కేటాయించారు. తాజాగా శాశ్వత భవనాల కోసం రఘునాథపాలెం శివారులో 40 ఎకరాల స్థలం గుర్తించారు. ఇందుకోసం నిధులు మంజూరైతే నిర్మాణాలు మొదలవుతాయి. ఇక వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రులకు నిధులు కేటాయించాల్సి ఉంది. వైరా, మధిర, కూసుమంచిలో 100 పడకలతో ఆస్పత్రులు నిర్మించాల్సి ఉండగా, ఒక్కోచోట రూ.36 కోట్ల మేర నిధులు అవసరముంది. అలాగే, కూసుమంచిలో 100 పడకలతో ట్రామా కేర్ భవనం నిర్మిస్తామని ప్రకటించారు. ఇప్పటికే స్థలాలు కేటాయించిన నేపథ్యాన నిధులు మంజూరైతే నిర్మాణాలు త్వరగా అందుబాటులోకి వస్తాయి.

■ లక్షల్లో దరఖాస్తులు



కేఎంసీలో ప్రజాపాలన దరఖాస్తులు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రజాపాలన సభల ద్వారా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ కోసం జిల్లాలో లక్షలాదిగా దరఖాస్తు అందాయి. రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకం కోసమే జిల్లావ్యాప్తంగా 4,88,316 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, కొత్తగా చేయూత పింఛన్ల కోసం 13,469 మంది దరఖాస్తు చేసుకోగా రేషన్‌కార్డుల కోసం ఎప్పుడు దరఖాస్తులు స్వీకరిస్తారా అని పలువురు ఎదురుచూస్తున్నారు. 2017 నుంచి గత ఏడాది చివరి వరకు 38,479 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరికి తోడు ఇంకొందరు అర్హులు ఉన్నారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ పథకానికి సైతం ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయిస్తారని ఆశ పెట్టుకున్నారు.

డెంగీ విజృంభణ...



ఓపీ విభాగంలో పేర్ల నమోదుకు క్యూ కట్టిన జనం

- గత రెండు వారాలుగా పెరుగుతున్న కేసులు
- వర్షాలకు తోడు పారిశుద్ధ్య లోపమే కారణం
- వివిధ శాఖల మధ్య సమన్వయం లేక సమస్య

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో గడిచిన రెండు వారాలుగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పల్లె, పట్నం తేడా లేకుండా మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటి బారిన ప్రజలు పడుతుండడం డెంగీ కేసుల సంఖ్య పెరగటానికి కారణమవుతోందని చెబుతున్నారు. వర్షాకాలం ఆరంభంలోనే ఏటా పల్లెప్రగతి, పట్టణ ప్రగతి పేరిట పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్నా ఈ ఏడాది ఎక్కడా దృష్టి సారించడం లేదు. జీపీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో నిర్వహణ కొరవడిందని తెలుస్తోంది. దీనికి తోడు వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడడం కూడా డెంగీ కేసులు పెరగడానికి కారణమనే ప్రచారం జరుగుతోంది.

పల్లెవాసులే బాధితులు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి డెంగీ కేసులు ఎక్కువగా వస్తున్నాయని సమాచారం. గత రెండు వారాల్లో కేసుల సంఖ్య పెరిగింది. వర్షంతో నీరు నిలవడానికి తోడు పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగకపోవడం దోమల వృద్ధికి కారణమవుతోంది. గడచిన రెండు వారాలుగా జిల్లాలో 16 చొప్పున డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 9,491 శాంపిళ్లు సేకరించగా ఈనెల 19వ తేదీ వరకు 210 డెంగీ పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. ఇందులో తిరుమలాయపాలెం పీహెచ్‌సీ పరిధిలోనే 18 కేసులు ఉంటే.. కేవలం జల్లేపల్లిలోనే 14 కేసులు నమోదు కావటం గమనార్హం. ఆ గ్రామంలో కేసులు ఎక్కువ రావడానికి పారిశుద్ధ్య లోపమే కారణమని వైద్య, ఆరోగ్య శాఖాధికారులు గుర్తించారు. అలాగే పెద్దగోపతి పీహెచ్‌సీ పరిధిలో 18 కేసులు నమోదు కాగా పెద్ద మునగాలలో 12, ఎం.వీ.పాలెం పీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా 29 కేసులు, మంచుకొండ పరిధిలో 20 కేసులు ఇప్పటివరకు నమోదయ్యాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం కొరవడడంతో డెంగీకి తోడు మలేరియా, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్లూ వ్యాపిస్తున్నాయి.

పెద్దాస్పత్రికి క్యూ

సీజనల్ వ్యాధుల ప్రభావంతో కొద్దిరోజులుగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య పెరిగింది. ప్రధాన ఆస్పత్రి కావటం, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో ఎక్కువ పీహెచ్‌సీలకు వెళ్లకుండా ఇటే వస్తున్నారు. ఉదయం 8 గంటల నుండే ఓపీ వద్ద క్యూ మొదలై ఆ తర్వాత గంటగంటకు కిటకిటలాడుతోంది. ఓపీ సేవలతో పాటు ఇన్‌పేషంట్ సేవలు కూడా పెరిగి పలు వార్డుల్లో బెడ్లు నిండిపోయాయి. నిత్యం 2వేల మందికి వరకు వస్తుండగా, వీరిలో 150 నుండి 200 మంది ఇన్‌పేషంట్లు చేరుతున్నారు. ప్రస్తుతం బెడ్డుకు ఒకరే చికిత్స పొందుతున్నా సీజనల్ వ్యాధుల ఉధృతి పెరిగితే మాత్రం ఒక్కో బెడ్డుపై ఇద్దరు, ముగ్గురికి చికిత్స చేసే పరిస్థితులు ఎదురు కావొచ్చని భావిస్తున్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి



దివ్యాంగురాలి వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో అందే దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే(ప్రజావాణి)లో ఆయన అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌తో కలిసి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఏదైనా దరఖాస్తును తిరస్కరిస్తే అందుకు కారణాన్ని కూడా తెలియచేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, డీఆర్‌డీఓ సన్యాసయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ప్రజావాణికి ప్రతీ వారం ధరణి సమస్యలు, పింఛన్ల మంజూరు, సదరం సర్టిఫికెట్లకు సంబంధించి దరఖాస్తులు ఎక్కువగా వస్తుండడంతో కలెక్టర్ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయించి సిబ్బందిని నియమించారు. దీంతో త్వరగా దరఖాస్తుల స్వీకరణ పూర్తవుతోంది.

ఫిర్యాదుల్లో కొన్ని..

కూసుమంచి మండలం జీళ్లచెరువుకు చెందిన అంబాల నరసయ్య గ్రామంలో ఇళ్ల స్థలాల పంపిణీకి తాను భూమి ఇచ్చినందున మూడు ప్లాట్లు కేటాయించాలని కోరారు. నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన పొట్టపింజర మాధవి వర్షాలతో తన ఇల్లు కూలిపోయినందున ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏన్కూరు మండలం నాచారానికి చెందిన కె.లలిత రేషన్ కార్డ్ ఇప్పించాలని, జూనియర్ లెక్చరర్ పి.చంద్రకళ మధిర నుండి ఖమ్మం బదిలీ అయిన నేపథ్యాన తన పిల్లలకు కేంద్రియ విద్యాలయంలో సీట్లు ఇప్పించాలని కోరారు. అలాగే, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం టీచర్స్ కాలనీ వాసులు అనుమతి లేని నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఇక పుట్టకోటకు చెందిన చిన్నంశెట్టి రామారావు తాను నిల్చోలేని పరిస్థితుల్లో ఉన్నందున ఉపాధి కల్పించాలని కోరారు. కాగా, కలెక్టరేట్‌లో బ్యాంకు, ఏటీఎం ఏర్పాటుచేయాలని ఆదేశించిన కలెక్టర్... డీపీఆర్వో కార్యాలయంలో ఏర్పాటుకు అవకాశముంటుందా అన్న అంశంపై పరిశీలన చేపట్టారు.

గోదారి ఉగ్రరూపం



భద్రాచలం వద్ద స్నానఘట్టాలను ముంచెత్తిన గోదావరి వరద

- మూడో ప్రమాద హెచ్చరికకు చేరువలో నీటిమట్టం
- అర్ధరాత్రి 12 గంటలకు 50.20 అడుగులకు చేరిన వరద

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ప్రమాదకరంగా మారుతోంది. సోమవారం ఉదయం నుంచి మొదటి ప్రమాద హెచ్చరికతో ప్రవహించిన నీటిమట్టం.. మధ్యాహ్నం రెండు గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్ రావు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అప్పటి నుంచి స్వల్పంగా పెరుగుతూ వస్తున్న వరద ప్రవాహం అర్ధరాత్రి 12 గంటలకు 50.20 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరిక సమీపానికి వచ్చింది. కాగా ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో పాటు దిగువన ఉన్న శబరి ఉప నది ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మంగళవారం సైతం గోదావరి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాచలంలోని ముంపు కాలనీలు, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వరద ప్రవాహం పెరిగి ఇళ్లను ముంచెత్తే ప్రమాదం ఉంటే సత్వరమే వారందరినీ పునరావాస శిబిరాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శిబిరాల్లో బఫర్ స్టాక్‌తో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆర్‌డీఓ దామోదర్ రావు రెవెన్యూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేస్తూ సలహాలు, సూచనలను అందజేస్తున్నారు.

ముంపు గ్రామాలకు రాకపోకలు బంద్..

గోదావరి ప్రవాహంతో రెండు రోజులుగా దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా సోమవారం ఆ సంఖ్య మరింతగా పెరిగింది. పర్ణశాల పుణ్యక్షేత్రంలోని సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపైకి నీరు చేరడంతో పర్ణశాలకు రాకపోకలు స్తంభించాయి. సున్నంబట్టి, బైరాగులపాడు నడుమ రాకపోకలు సైతం నిలిచిపోయాయి. మూడో ప్రమాద హెచ్చరిక దాటితే భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల మండలాల నడుమ పలు చోట్ల ప్రధాన రహదారులపైకి నీరు చేరే అవకాశం ఉంది. కాగా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విలీన మండలాలకు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సైతం రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. చర్ల మండలంలోని తాలిపేరు నుంచి వరద నీటిని గత మూడు రోజులుగా నిరంతరాయంగా గోదావరిలోకి వదులుతూనే ఉన్నారు. ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు ఎత్తి సగటున 43 వేల క్యూసెక్కులకు పైగానే నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు.

ట్రెండ్ మారిన నదీ ప్రవాహం..

ప్రతీ ఏడాది ముంపు ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసే గోదావరి గత సంవత్సరం ఒక్కసారి మాత్రమే మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. 2022 జూలై 16న గోదావరి చరిత్రలోనే రెండో అతి పెద్ద ప్రవాహంగా 71.3 అడుగులతో ఉగ్రరూపాన్ని చూపించింది. 2023 జూలై 29న 56.1 అడుగులుగా నమోదైంది. గతేడాది ఇదే అత్యధికం. ఇక ఈ సంవత్సరం మళ్లీ 50 అడుగులకు పైగా గోదావరి ప్రవహిస్తోంది. ఇప్పటి వరకు గోదావరి ప్రవాహాలు అత్యధికంగా ఆగస్టు నెలలోనే సంభవించగా, గత మూడేళ్లుగా జూలైలోనే అత్యధికంగా ప్రవహిస్తూ ట్రెండ్ మార్చింది.

హాస్టళ్లకు విజయ పాల సరఫరా ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య(విజయ డెయిరీ) ద్వారా పాల సరఫరా ప్రారంభమైంది. జిల్లాలోని 180 వసతి గృహాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రస్తుతం రోజుకు 2,700 లీటర్ల పాలను ఐదు రూట్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆదివారం నుంచి సరఫరా మొదలైందని అధికారులు తెలిపారు. అయితే, భద్రాద్రి జిల్లాలోని 212 హాస్టళ్లకు 3 వేల లీటర్లకు పాలు సరఫరా చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ ఇంకా ఖరారు కాలేదు. పలు ప్రాంతాలకు సరైన రహదారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఎంపికలో జాప్యమవుతోందని తెలిసింది.

కొత్త విమానాశ్రయాల నిర్మాణం చేపట్టండి

లోక్‌సభలో కోరిన ఎంపీ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ప్రస్తుతం హైదరాబాద్‌లో మాత్రమే విమానాశ్రయం ఉన్నందున రాష్ట్రంలో మరో ఆరు చోట్ల ఎయిర్‌పోర్టులు నిర్మించాల్సిన అవసరముందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి కోరారు. లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా ఆయన మాట్లాడారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు నిర్మించడమే కాక వరంగల్ జిల్లా మామునూరు, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఎయిర్‌పోర్ట్‌లను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. వీటన్నింటిపై ఎయిర్‌పోర్టు అథారిటీ గతంలోనే సర్వే పూర్తిచేసిందని తెలిపారు. ఇందులో కనీసం రెండింటినీ త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి



గాయపడిన వారితో మాట్లాడుతున్న మంత్రి

ముదిగొండ: రోడ్డుప్రమాదంలో గాయపడిన వారిని పోలీసు వాహనాలో ఆస్పత్రికి తరలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. మంత్రి సోమవారం సాయంత్రం నేలకొండపల్లి పర్యటనకు వెళ్తుండగా ముదిగొండ మండలం వెంకటాపురం వద్ద మాదాపురం మాజీ ఎంపీటీసీ దంపతులు జి.మణెమ్మ – నాగయ్య రోడ్డుప్రమాదంలో గాయపడి కనిపించారు. వీరి బైక్‌ను ఇంకో వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని గుర్తించిన మంత్రి క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈమేరకు నాగయ్య దంపతులను ముదిగొండ ఎస్‌ఐ నరేష్ పోలీస్ వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా లైబ్రరీలో మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం



నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణ పనులు మొదలయ్యాయి. 'గ్రంథాలయంలో ప్రిపరేషాన్!' శీర్షికన ఈనెల 12న 'సాక్షి'లో పాఠకుల ఇబ్బందులపై కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లైబ్రరీని రెండుమార్లు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. గత ఏడాది గ్రంథాలయ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి కూలిపోగా, శిథిలాలను తొలిగించే క్రమంలో ప్రమాదకరంగా ఉన్న మరుగుదొడ్లు, ప్రహరీని సైతం కూల్చివేశారు. ఈమేరకు ప్రత్యేక నిధుల ద్వారా రూ.13.3 లక్షలు కేటాయించడంతో పది మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు.

'రాయల' మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు



రాయల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం

తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఇటీవల మృతిచెందిన రాయల కుటుంబాన్ని తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో సోమవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. నాయకులు కొమ్ము శ్రీను, పప్పుల ఉపేందర్, ఎల్లంపల్లి నాగయ్య, రాయల రవికుమార్, రాయల రాజా, తమ్మినేని ఉమ, దొండేటి సుగుణమ్మ, తమ్మినేని ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

10 అడుగులకు చేరిన పాలేరు

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటి మట్టం సోమవారం సాయంత్రానికి 10అడుగులకు చేరింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23అడుగులు కాగా, కనిష్టస్థాయికి చేరడంతో సాగర్ నుండి పాలేరుకు రెండు రోజుల క్రితం నీరు విడుదల చేశారు. సాగర్ నుండి 3,400 క్యూసెక్కుల నీరు చేరుతుండగా నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. వర్షాల కారణంగా రిజర్వాయర్‌లోకి ఎగువ నుండి సైతం మరో 200 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

నిల్వల్లో తేడా వస్తే చర్యలు

ఖమ్మం సహకారనగర్: రేషన్‌షాపుల్లోని బియ్యం నిల్వల్లో హెచ్చుతగ్గులు ఉంటే డీలర్లపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. డీలర్లు సమయపాలన పాటించడమే కాక రోజువారీగా స్టాక్ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,100	6,800
కందులు	10,700	9,500
మిర్చి	17,000	7,000
మిర్చి తాలు	9,300	9,300
ఏసీ మిర్చి	19,300	10,000
ఏసీ తాలు	10,000	9,000
పత్తి	7,375	6,401

– ఖమ్మం వ్యవసాయం

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

- పెద్దాస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- కొందరు వైద్యులు, సిబ్బంది అలసత్వంపై హెచ్చరిక



చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించి వారి నమ్మకాన్ని మరింతగా పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సోమవారం తనిఖీ చేసిన ఆయన క్యాజువాలిటీ, ఫార్మసీతో పాటు పలు వార్డులను పరిశీలించారు. క్యాజువాలిటీ వైద్యులు, సిబ్బంది అలసత్వంగా ఉంటుండటంతో వారిని మందలించారు. ఆస్పత్రికి వచ్చే వారిని కుటుంబీకుల్లా భావించి వైద్యం అందించాలని తెలిపారు. ఇటీవల కొందరు రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విషయమై వీడియో వైరల్ కావడంతో ఇకనుంచి తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మందుల స్టాక్, వ్యాక్సిన్ నిల్వలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓలు బి.రాంబాబు, రాథోడ్ వినాయక్, అమర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

పెద్దాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

వైద్య విధాన పరిషత్‌లో ఉన్నప్పటితో పోలిస్తే డీఎంఈ ఆధీనంలోకి వచ్చాక ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యసేవలు మెరుగయ్యాయని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ రాథోడ్ వినాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వీవీపీ పరిధిలో ఉన్నప్పుడు వైద్యసేవలు మాత్రమే కొనసాగించగా.. ఇప్పుడు చికిత్స, బోధన సమాంతరంగా జరిగేలా ముందుకెళ్తున్నామని చెప్పారు.

పట్టుదలతో కృషి చేస్తేనే లక్ష్యసాధన

ఖమ్మంమయూరిసెంటర్: ఏకాగ్రత, పట్టుదలతో కృషి చేస్తే లక్ష్య సాధన సులువవుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1 అభ్యర్థులకు శిక్షణ ఇస్తుండగా సోమవారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. శ్రమపై దృష్టి సారిస్తే కచ్చితంగా ఫలితం వస్తుందని తెలిపారు. ఒకరినొకరు తెలిసిన విషయాలను పంచుకోవడమేకాక ఇళ్లు, చదువును సమన్వయం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

మెడికల్ షాపులోనే చికిత్స చేస్తున్న వైనం



చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం

వేంసూరు: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ ధనార్జనే లక్ష్యంగా కొందరు మెడికల్ షాపుల మాటున అర్హతకు మించి చికిత్స చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వేంసూరు మండలం మర్లపాడులో విజయలక్ష్మి మెడికల్ షాపును సోమవారం కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం ఆకస్మిక తనిఖీ చేయగా ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్న అర్వేపల్లి కరుణప్రసాద్ అర్హత లేకున్నా చికిత్స చేస్తూ పలువురికి డెంగీ, మలేరియా సోకిందని ఆందోళనకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీ చేయగా ఆరుబయట బల్లలపై పలువురిని కూర్చోపెట్టి సెలైన్ ఎక్కిస్తున్నట్లు తేలింది. అంతేకాక మెడికల్ షాపు వెనక గదిలో కొందరిని చేర్చుకుని చికిత్స చేస్తున్నట్లు గుర్తించిన సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత లేని వారి వద్ద వైద్యం చేయించుకోవద్దని ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని స్థానికులకు ఆయన సూచించారు. అంతేకాక కరుణప్రసాద్‌ను మందలిస్తూ గతంలో పలుమార్లు తీరు మార్చుకోకపోవడంపై మండిపడ్డారు. మందులు అమ్మడానికి మాత్రమే అనుమతి ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఇదిలాగే కొనసాగితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్ఓ హెచ్చరించారు.

'కిమ్స్'లో బైపాస్ సర్జరీ థియేటర్ ప్రారంభం



బైపాస్ సర్జరీ థియేటర్‌ను ప్రారంభిస్తున్న సాంబమూర్తి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీకి సంబంధించి అత్యాధునిక పరికరాలతో కూడిన లామినార్ ఆపరేషన్ థియేటర్‌ను సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, చావా శివరామకృష్ణ, బాబురెడ్డితో కలిసి సీనియర్ పీడియాట్రిక్ హార్ట్ సర్జన్ కోన సాంబమూర్తి, డాక్టర్ కృష్ణ కిశోర్ ఈ థియేటర్‌ను ప్రారంభించారు. అనంతరం సాంబమూర్తి, కృష్ణకిశోర్ మాట్లాడుతూ మహా నగరాలకే పరిమితమైన హృద్రోగ శస్త్ర చికిత్స థియేటర్లు, అత్యాధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు కిమ్స్‌లోనూ అందుబాటులో ఉన్నారని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు ప్రసాద్‌రెడ్డి నేతృత్వాన కిమ్స్ ఆస్పత్రిలో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందిన్నారని చెప్పారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు మల్లెంపాటి రవీంద్రనాథ్, రావెళ్ల రంజిత్, యార్లగడ్డ రజిత, శీలం శిరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యానికి గురైన నిరుపేదల చికిత్స కోసం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోమవారం అందజేశారు. ఎమ్మెల్సీ సిఫారసుతో మంజూరైన రూ.16.25 లక్షల విలువైన 54 చెక్కులను ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన అందజేసి మాట్లాడారు. ఆతర్వాత ఎమ్మెల్సీ మధు ఆధ్వర్యాన బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిశారు. కలెక్టర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపాక చింతకాని మండలం ప్రొద్దుటూరులో రైతు బోజేడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన వారి విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బెల్లం వేణు, పగడాల నాగరాజు, తాజుద్దీన్, వీరన్న, పోట్ల శీను, ముత్యాల వెంకట అప్పారావు, పగడాల నరేందర్, కోడిరెక్కల ఉమాశంకర్, లింగన్నబోయిన సతీష్, నాయకులు ధనుంజయ్, విజయ్, సద్దాం షేక్, ఫిరోజ్, దినేష్ పాల్గొన్నారు.

ఎంత రుణం మాఫీ అయింది?

గ్రామాల్లో ఆరా తీస్తున్న అధికారులు



చైర్మన్, డైరెక్టర్లతో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ రెహమాన్

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తుండగా, రైతులు ఏమనుకుంటున్నారనే విషయాన్ని తెలుసుకునేందుకు అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సోమవారం సాయంత్రం కొణిజర్ల మండలం తనికెళ్లలో పర్యటించి పలువురు రైతులను ఆరా తీశారు. గ్రామానికి చెందిన సంగెపు సక్కుబాయి, గుమ్మెడెల్లి రామారావు, కోల్లూరి వెంకటప్పయ్య, కోల్లూరి నాగేశ్వరరావు ఇళ్ల వద్ద వారిని కలిసిన డీఏఓ, ఎంత రుణం తీసుకున్నారు, వడ్డీతో కలిపి ఎంత మాఫీ అయిందనే వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు పెట్టుబడి సమయాన ఒకేసారి రుణమాఫీ చేయడం, తిరిగి బ్యాంకులు రుణాలు ఇవ్వనుండడం ఆనందంగా ఉందని తెలిపారు. ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండలో డీసీసీబీ చైర్మన్ .

ముదిగొండ: ముదిగొండ పీఏసీఎస్ కార్యాలయాన్ని డీసీసీబీ సీఈఓ రెహమాన్ సోమవారం సందర్శించారు. సొసైటీ పరిధిలో రూ.లక్షలోపు రుణాలు ఎందరు రైతులకు మాఫీ అయ్యాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతుల జాబితాను ప్రదర్శించడంతో పాటు వారి సందేహాలు నివృత్తి చేయాలని సూచించారు. అనంతరం మేడేపల్లిలో ఆయిల్‌పామ్ రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో డీసీసీబీ సీఈఓ మాట్లాడుతూ రైతులు డీసీసీబీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ డీజీఎం ఉదయశ్రీ, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ముదిగొండ, మేడేపల్లి సొసైటీల చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటేశ్వరరావు, డీసీసీబీ మేనేజర్ అలేఖ్య, సీఈఓలు వెంకటరత్నం, శ్రీనివాసరావుతో పాటు బట్టు పురుషోత్తం, వనం ప్రదీప్తచక్రవర్తి, ఏలూరి వెంకటేశ్వరరావు, రాయల శ్రీనివాసరావు, గోపిరెడ్డి నాగిరెడ్డి, కోటేశ్వరరావు, ప్రసాద్, వీరారెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ ఎందుకు కాలేదు?



కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ వద్ద వేచి ఉన్న రైతులు

ఖమ్మం సహకారనగర్: రూ.లక్ష లోపు రుణాలు ఉన్నా మాఫీ కాకపోవడంతో పలువురు రైతుల్లో సందిగ్ధత నెలకొంది. దీంతో మండలాల్లో అధికారులు, బ్యాంకుల్లో సంప్రదించినా సరైన సమాధానం రాక పలువురు కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యాన రుణమాఫీ హెల్ప్‌డెస్క్‌కు కొద్దిరోజులుగా బారులుదీరుతున్నారు. ఇప్పటివరకు 650మంది తమకు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేయగా.. ఇందులో ఒక్క సోమవారమే 350 మంది దరఖాస్తు సమర్పించారు. వ్యవసాయ శాఖాధికారులు, బ్యాంకర్లు సకాలంలో స్పందించడం లేదని చెబుతూ హెల్ప్‌డెస్క్‌లో ఫిర్యాదులో అందజేశారు. ఈమేరకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ముదిగొండ మండలం పెద్దమండవకు చెందిన పాకినాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వల్లభిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో 2019 జనవరి 2న రూ.45వేల రుణం తీసుకుంటే వడ్డీతో కలిపి రూ.76వేలకు చేరిందని తెలిపారు. అయినా రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులో అడిగితే మొండి బాకీ అని చెప్పారన్నారు. ఈమేరకు తనకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

'శిక్ష సప్తాహ్'ను విజయవంతం చేయాలి

చింతకాని: జాతీయ విద్యావిధానం అమల్లోకి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. మండలంలోని కొదుమూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు ప్రదర్శించిన అభ్యసన సామాగ్రిని ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధతో చదవాలని సూచించారు. ఏఎంఓ రవికుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు తేలనున్న చేపపిల్లల టెండర్లు

- జిల్లాలో 3.50 కోట్ల పిల్లల సరఫరాకు దరఖాస్తులు
- 896 జలాశయాలకు రూ.4కోట్లతో అంచనా

ఖమ్మంవ్యవసాయం: జిల్లా జలాశయాల్లో వదిలేందుకు కావాల్సిన చేపపిల్లల సరఫరా కోసం టెండర్ల దాఖలు గడువు మంగళవారంతో ముగియనుంది. మొత్తం 896 జలాశయాల్లో విడుదల చేసేందుకు కావాల్సిన 3.50 కోట్ల చేపపిల్లలకు ఆన్‌లైన్‌లో టెండర్లు స్వీకరిస్తుండగా మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు దరఖాస్తు గడువు ముగిశాక పరిశీలించనున్నారు. నీటి సామర్థ్యం, విస్తీర్ణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని జలాశయాల్లో 80–100 మి.మీ.ల చేపపిల్లలు 2.60 కోట్ల వరకు, 35–40 మి.మీ.ల వరకు సైజ్‌లో 90 లక్షల పిల్లలు పోసేందుకు నిర్ణయించారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.4కోట్లు వెచ్చించనుంది. గత ఏడాది 903 జలాశయాల్లో చేప పిల్లలు పోయగా, ఈసారి 896కు కుదించారు. టెండర్లు పరిశీలించాక తక్కువ ధర కోట్ చేసిన వారి సీడ్ ఫామ్‌లను మత్స్యశాఖ అధికారులు పరిశీలించి కేటాయింపు చేపడతారు. ఆతర్వాత జలాశయాల్లో నీటి నిల్వల ఆధారంగా ఆగస్టు రెండు, మూడో వారంలో చేపపిల్లలు వదిలేలా కార్యాచరణ రూపొందించారు. జిల్లాలోని నేలకొండపల్లి మండలం నాచేపల్లి, కల్లూరు మండలం లోకారం, బోనకల్ మండలం కలకోటతో పాటు మరికొన్ని ప్రాంతాల వ్యాపారులు కూడా టెండర్లు దాఖలు చేయగా, ఇతర జిల్లాల వారు ముందుకొచ్చినట్లు తెలిసింది. ఈసారి ఎవరికి టెండర్లు దక్కుతాయో మంగళవారం సాయంత్రంకల్లా స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలని ధర్నా



పాలేరులో ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కూసుమంచి: మండలంలోని పాలేరు ఉన్నత పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో 1నుండి పదో తరగతి వరకు 225మంది విద్యార్థులు ఉండగా, అందులో ఉన్నత పాఠశాలలోనే 115 మంది ఉన్నారని తెలిపారు. అయితే, ఉన్నత పాఠశాల విద్యార్థుల బోధనకు ఇద్దరే టీచర్లు ఉండడంతో ఎస్జీటీలతో పాఠాలు చెప్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై ఎంఈఓ స్పందిస్తూ టీచర్ల కొరత నిజమేనని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

జైత్రాంతండా పాఠశాల వద్ద...

కారేపల్లి: మండలంలోని జైత్రాంతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 53మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయురాలు బోధిస్తుండడంతో, మరో టీచర్‌ను నియమించాలంటూ విద్యార్థులు సోమవారం నిరసన తెలిపారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు బదిలీ అయ్యారు. ఇక ఇందిర అనే ఉపాధ్యాయురాలు మిగలగా, బదిలీ అయిన టీచర్ స్థానంలో సుమన్‌ను కేటాయించినా ఆయన ఉన్నత చదువుల నిమిత్తం సెలవులో వెళ్లారు. ఈమేరకు ఒకే ఉపాధ్యాయురాలు 53మందికి బోధించడం కష్టంగా ఉన్నందున మరో టీచర్‌ను కేటాయించాలని నిరసన తెలిపారు. ఈ విషయమై ఎంఈఓ జయరాజును వివరణ కోరగా సమస్యను డీఈఓ దృష్టికి తీసుకెళ్లగా డిప్యూటేషన్‌పై మరో ఉపాధ్యాయుడిని రెండు రోజుల్లో నియమించనున్నట్లు తెలిపారని వెల్లడించారు.

సత్తుపల్లి డివిజన్‌లో ఇంటర్ లింక్ లైన్ ఏర్పాటు



నూతన లైన్‌ను చార్జ్ చేసిన ఎస్ఈ సురేందర్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: సత్తుపల్లి విద్యుత్ డివిజన్ పరిధిలో కుర్నవల్లి – గరికపాడు సబ్ స్టేషన్ల మధ్య ఇంటర్ లింకింగ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. 10.5 కిలోమీటర్ల పొడవుతో 33 కేవీ సామర్థ్యం కలిగిన ఈ లైన్‌ను రూ.70 లక్షల ఖర్చుతో నిర్మించారు. ఈ లైన్ ద్వారా కుర్నవల్లి, పెద్దకోరుకొండి, గరికపాడు సబ్‌స్టేషన్ల పరిధి 60 గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. కాగా, నూతన లైన్‌ను ఎస్ఈ ఏ.సురేందర్, డీఈ ఎల్.రాములునాయక్, ఏడీఈలు ఖాదర్‌బాబా, రామకృష్ణ, కుర్నవల్లి, ఏఈ సుందర్ కుమార్ సోమవారం టెక్నికల్ చార్జ్ చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుటే ఇరువర్గాల ఘర్షణ



ఇరువర్గాలకు నచ్చచెబుతున్న ఎస్సై

వైరా: వివాహేతర సంబంధం విషయమై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇరువర్గాలు పోలీసుస్టేషన్ ఎదుటే ఘర్షణ పడిన వైనమిది. వైరా ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగలక్ష్మికి రఘునాథపాలెం మండలం చింతగుర్తి వాసి సతీష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల సతీష్ మద్యానికి బానిసై మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని తెలుసుకున్న నాగలక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. అదేసమయాన సతీష్ తరఫు బంధువులు కూడా చేరుకోగా.. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్ ఎదుట పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ ఇరువర్గాలను చెదరగొట్టి ఫిర్యాదులు స్వీకరించారు.

జిల్లాలో ముగ్గురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథపాలెం సీఐ తుమ్మలపల్లి శ్రీహరిని ఖమ్మం మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో వరంగల్ కమిషనరేట్ నుంచి ఎండీ.ఉస్మాన్ షరీఫ్‌ను కేటాయించారు. ఇక వీఆర్‌లో ఉన్న బరపాటి రమేష్‌ను ఐజీ కార్యాలయానికి కేటాయించి, రామగుండం పోలీస్ కమిషనరేట్ నుంచి ముత్తిలింగయ్యను సత్తుపల్లి రూరల్ సీఐగా బదిలీ చేశారు. అలాగే, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ వేణును ములుగు ఎస్బీ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

అదుపుతప్పి కారు బోల్తా



కారులోని వ్యక్తులను బయటకు తీస్తున్న స్థానికులు

కారేపల్లి: అదుపుతప్పి కారు బోల్తా కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. భద్రాద్రి జిల్లా హేమచంద్రపురం గ్రామానికి చెందిన ఇద్దరు కారులో ఖమ్మం నుంచి ఇల్లెందు మీదుగా సోమవారం హేమచంద్రపురం వెళ్తున్నారు. ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారి శాంతినగర్ ఓసీ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు దిగువ కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరి తలకు తీవ్రగాయం కాగా, మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు వీరిని బయటకు తీసి, ద్విచక్రవాహనంపై ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు కింద చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి బిక్కం రజని సోమవారం తీర్పు చెప్పారు. ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం లెనిన్‌నగర్‌కు చెందిన సయ్యద్ యూసఫ్ అలీ కవిరాజ్ నగర్‌కు చెందిన చెన్నూరి రాజ్యలక్ష్మి వద్ద 2016లో రూ.10లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ చెల్లించే క్రమాన 2017 అక్టోబర్‌లో చెక్కు ఇవ్వగా ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. దీంతో రాజ్యలక్ష్మి తన న్యాయవాది ఎం.శ్రీనివాసరావు ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి రూ.10లక్షలు తిరిగి చెల్లించాలని ఆదేశించడంతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.